సాక్షి ప్రకాశం

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



ప్రభుత్వ వైఫల్యం.. ప్రజలే శ్రమదానం

ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో యువకులే స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు చేశారు.

- 8లో..



వాగులో పడి బాలుడు మృతి

వాగులో పడి బాలుడు మృతిచెందిన ఘటన గిద్దలూరు మండలం గడికోట సమీపంలోని నగిలేరులో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం 38 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ కార్డు చూపిస్తున్న కలెక్టర్ పీ.రాజా బాబు

ఒంగోలు సబర్బన్: స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టడం ద్వారా పౌరసరఫరాల వ్యవస్థలో నూతన అధ్యాయమని కలెక్టర్ పీ.రాజాబాబు అన్నారు. ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం కలెక్టరేట్లో నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ మంత్రి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీఎం కార్డు సైజులో ఉండే స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా ఏ షాపులో, ఏ సమయంలో రేషన్ సరుకులు తీసుకున్నారో ట్రేస్ చేయవచ్చన్నారు. కార్డు పోయినా జిరాక్స్ కాపీతో కార్డుదారులు రేషన్ సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,51,818 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వీరికి 1392 రేషన్ షాపుల ద్వారా సరుకులు అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో కార్డుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని డీఎస్‌ఓ పద్మశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, ఒంగోలు ఆర్డీవో కళావతి, ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.వెంకట్రావు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు నగర మేయర్ సుజాత, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్-19 బాలబాలికల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక



బాలురు క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సింగరాయకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం అండర్-19 బాల బాలికల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. జూనియర్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ కే శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెలక్టర్లుగా జే ప్రభాకర్, నామా చంద్రశేఖర్, ఏ కిరణ్‌కుమార్, పీ రమేష్, సయ్యద్ జంషీర్ అబ్దుల్ పాల్గొన్నారు.

"ఇసుక డంపింగ్ యార్డు నిర్వహణకు ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చింది. అయితే కొంతమంది వ్యక్తులు ప్రైవేటుగా వాహనాల్లో తెచ్చి సొంతంగా ఇసుక అమ్ముకుంటున్నారు. ఒక్క ఒంగోలు నగరంలోనే 40 మంది వ్యక్తులు సొంతంగా ఇసుక డంపింగ్ చేస్తున్నారు. వారితో నేను పోరాడే పరిస్థితి లేదు. ఇక్కడ వ్యాపారం చేసే పరిస్థితులు లేవు. ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్‌ను దయచేసి రద్దు చేయండి..." అంటూ ఫ్యూచర్ ట్రెండ్స్‌కు చెందిన భరత్ మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందచేయడం జిల్లాలో అధికార కూటమి నేతల ఇసుక ఆగడాలకు అద్దం పడుతోంది. లైసెన్స్ పొందిన వ్యాపారులపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుల దౌర్జన్యాలు, రౌడీయిజానికి అంతేలేకుండా పోతోందనదానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచితంగా ఇసుక ఇస్తున్నట్లు తెగ ప్రచారం చేసుకుంటున్నారు. మరో వైపున మద్యం బెల్ట్ షాపుల తరహాలో ప్రైవేటు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకున్న తమ్ముళ్లు యథేచ్ఛగా ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు అధిక ధరలకు ఇసుకను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

- జిల్లాలో ఇసుక వ్యాపారులపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు
- లైసెన్స్ పొందినవారు అమ్మకాలు చేయకుండా పచ్చమంద సొంత దందా
- లైసెన్స్ రద్దు చేయాలంటూ ఒంగోలు యార్డు నిర్వాహకుడు భరత్ మైనింగ్ డీడీకి వినతి
- జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసింది 6 డంపింగ్ యార్డులు
- 38 మండలాల్లోనూ ప్రైవేటుగా యార్డులు
- ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనంగా రూ.500 నుంచి రూ.700 వసూలు
- నెలవారీ ముడుపులు తీసుకొని ప్రైవేటు ఇసుక డంప్‌ల మీద చర్యలు



టీడీపీ నాయకుల దౌర్జన్యాలు

ఇసుక అమ్మకాల విషయంలో జిల్లాలో తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యాలు, అరాచకాలపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి. కీలక నాయకులు నిర్ణయించిన టీడీపీ నాయకులు మాత్రమే ఇసుక అమ్మకాలు చేయాలని హుకుం జారీ చేసి బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇసుక వ్యాపారుల మీద దాడులు చేశారు. వారి టిప్పర్లను ధ్వంసం చేశారు. లారీ డ్రైవర్లను చితకబాది వేధింపులకు గురిచేశారు. లారీలను స్వాధీనం చేసుకున్నారు. తమకు కప్పం కట్టకుండా జిల్లాలో ఇసుక విక్రయించడానికి వీలులేదని రౌడీయిజం చెలాయించారు. టిప్పర్ల యజమానులకు కోట్లాది రూపాయలు ఇవ్వకుండా వేధించడంతో వారు కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగడం సంచలనం సృష్టించింది. తాజాగా మరో వ్యక్తి తనకు ఇచ్చిన లైసెన్స్‌ను రద్దు చేయమని కోరడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ అధికారులైతే మొద్దు నిద్ర పోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మైనింగ్ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తమ్ముళ్లతో తాళలేక.. ఇసుక తోలలేక!

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక పేరుతో గత ఏడాది నవంబరులో జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి ప్రాంతాల్లో డంపింగ్ యార్డులకు అనుమతిచ్చి లైసెన్స్‌లు మంజూరు చేసింది. ఫ్యూచర్ ట్రెండ్స్ సంస్థ నిర్వాహకుడు భరత్‌కు ఒంగోలు డంపింగ్ యార్డుకు లైసెన్స్ మంజూరైంది. భరత్ పశ్చిమ ప్రకాశం జిల్లా అధికార పార్టీకి చెందిన ఒక కీలక ఎమ్మెల్యే అనుచరుడిగా ప్రచారం జరుగుతోంది. ఈ లైసెన్స్ కోసం ఆయన కోటి రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. జనవరిలో ఆయన డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికే నగరంలో టీడీపీకి చెందిన కొందరు నాయకులు సొంతంగా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసుకుని ఇసుక విక్రయాలు ప్రారంభించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి ప్రైవేటు డంపింగ్ యార్డులు ఒక్క ఒంగోలు నగరంలోనే సుమారు 40 యార్డులు ఉన్నట్లు భరత్ ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అధిక ధరలకు ఇసుక విక్రయించడమే కాకుండా ప్రభుత్వ డంపింగ్ యార్డులో ఇసుక కొనుగోలు చేయకుండా కస్టమర్లపై ఒత్తిళ్లు చేసేవారని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ డంపింగ్ యార్డు నిర్వాహకుడైన భరత్ ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికే కోటి రూపాయల చేతిచమురు వదిలించుకున్న ఆయన డంపింగ్ యార్డుకు తాళాలు వేసి వెళ్లిపోయాడు. ఇటీవల కలెక్టర్ పిలుపు మేరకు ఒంగోలు వచ్చిన ఆయన తిరిగి డంపింగ్ యార్డు తెరిచినప్పటికీ తెలుగు తమ్ముళ్ల దందా ముందు తాళలేకపోయాడు. ఈసారి ఏకంగా తన లైసెన్స్ రద్దు చేయమంటూ ఆయన మైనింగ్ డీడీకి వినతి పత్రం అందించడంతో జిల్లాలో తెలుగు తమ్ముళ్ల ఉచిత ఇసుక దోపిడీపై చర్చకు తెరతీసినట్లయింది.

బెల్టు షాపుల తరహాలో ఇసుక యార్డులు..

జిల్లాలో బెల్టు షాపుల తరహాలో ఇసుక యార్డులు కూడా వెలిశాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ అనధికారిక యార్డులు నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తాము చెప్పిన రేటుకే ఇసుక అమ్మకాలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. తమ వద్దకాదని ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తెచ్చుకుంటే లారీకి వారు చెప్పిన కప్పం కట్టి వెళ్లాల్సిందే. లేదంటే అధికారులను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ఇక్కడ ప్రభుత్వం గిద్దలూరులో అధికారికంగా ఇసుక డంపింగ్ యార్డు నిర్వహణకు లైసెన్స్ మంజూరు చేసింది. నియోజకవర్గంలో ఎవరైనా సరే ఇక్కడ నుంచి ఇసుక కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ అధికార టీడీపీ కీలక నేత ఇక్కడ సొంతంగా ప్రతి మండలంలోనూ ఇసుక డంపింగ్ యార్డులకు అనుమతి ఇవ్వడం విమర్శల పాలవుతోంది. నియోజకవర్గంలోని కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, బేస్తవారిపేట, కంభంలలో ఇసుక డంపింగ్ యార్డులు పెట్టి అనధికారికంగా ఇసుక అమ్మకాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్కాపురం నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పొదిలిలో అనధికారికంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి అధిక ధరలకు ఇసుక విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మార్కాపురంలో అధిక ధరలకు ఇసుక విక్రయాలు చేస్తున్నారు. నేరుగా ఇసుక తెచ్చుకుంటే రూ.900 కు వచ్చే ఇసుక ఇసుకను రూ.1500 కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజల జేబుకు రూ.600 వరకు చిల్లు పడుతోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం, పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల మండలాల్లో కూడా అనధికారికంగా డంపింగ్ యార్డులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కనుసన్నల్లోనే ఈ యార్డులను ఏర్పాటు చేసి దొడ్డిదారిన ఇసుక విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక దర్శి నియోజకవర్గంలో అయితే టీ ట్యాక్స్ వసూలు చేసేందుకు ఒక కంటైనర్ ఏర్పాటు చేయడం గమనార్హం. ఎక్కడనుంచైనా నియోజకవర్గంలోకి ఇసుక లారీ, ట్రాక్టర్ వచ్చిందంటే వీరికి ట్యాక్స్ కట్టాల్సిందే. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలులో 40 వరకు ఇసుక డంపింగ్ యార్డులు ఉన్నట్లు అధికారిక డంపింగ్ యార్డు నిర్వాహకుడు భరత్ ఆరోపణలు చేయడం గమనార్హం. కొండపి నియోజకవర్గానికి డంపింగ్ యార్డు మంజూరు చేయలేదు. జరుగుమల్లి, పొన్నలూరు మండలాలు పాలేరు నదీ తీర ప్రాంతంలో ఇసుక లభ్యమౌతుంది. ఇక్కడ నుంచి టీడీపీ నాయకులు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వుకుంటున్నారు. ట్రాక్టర్ లోడింగ్ రూ.800 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లిలో అనధికారికంగా ఇసుకను అమ్మేసుకుంటున్నారు. కనిగిరిలో ట్రాక్టర్‌కు రూ.500 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ దుర్మార్గ ఆలోచనకు బుద్ధి చెప్పాలి

- మెడికల్ కళాశాలల ప్రైవేటు పరంతో పేదలకు వైద్యం దూరం
- టీడీపీ పెద్దల బినామీలకు కట్టబెట్టేందుకు కుట్ర
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేపీ నాగార్జునరెడ్డి
- కంభంలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ



ర్యాలీలో పాల్గొన్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరంచేసే ప్రభుత్వ దుర్మార్గ ఆలోచనకు ప్రజలే బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. కంభంలోని వైజంక్షన్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా కందులాపురం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో ర్యాలీగా వైజంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభ వద్దకు చేరారు. పీపీపీ పేరుతో ప్రజలకు వైద్యం అందుబాటులోకి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. టీడీపీ పెద్దలు వారి అనుచరులకు, బినామీలకు మెడికల్ కాలేజీలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేసిందని విమర్శించారు. నేడు వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని వివరించారు. విద్య, వైద్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుట్రలు చేసి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులను అక్రమ అరెస్టులు చేయడంపై దృష్టి పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటిరోజు నుంచే నకిలీ మద్యం తయారు కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ పాలనలో 43 వేల బెల్ట్‌షాపులను తొలగిస్తే నేడు ఇంటింటికీ మద్యం సరఫరా జరుగుతోందన్నారు. 1923 నుంచి 2019 వరకు ఏపీలో 12 మెడికల్ కళాశాలలు ఉన్నాయని, 2300 మంది డాక్టర్లుగా చదువుకునేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కరోనా సమయం రెండున్నరేళ్లు పోగా దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకుకొచ్చిందన్నారు. ఒక్కొక్క కళాశాలకు 50 ఎకరాలు స్థలం కేటాయించారని, ఐదు కళాశాలలను పూర్తి చేసి ప్రారంభించారని చెప్పారు. ఎన్నికల సమయంలో మరో రెండు కళాశాలల పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకో ఆరు కాలేజీలు 80 శాతం, మూడు కాలేజీలు 40 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఏడాదికి వెయ్యి కోట్లు ఖర్చు పెడితే అన్నీ కళాశాలలు పూర్తయి ఏడాదికి 2550 మంది డాక్టర్లుగా చదువుకుని బయటకు వస్తారన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రజలకు వైద్యసేవలు గ్రామీణ ప్రాంతాలకు చేరువ అవుతాయన్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ పూర్తి కావడంతో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో అధునాతనమైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

చంద్రబాబు పాలన అంతా ఆర్భాటం..

చంద్రబాబు 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన సమయంలో ఏనాడూ పేద ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోలేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సూపర్‌సిక్స్‌తోపాటు 200 హామీలు ఇచ్చిన చంద్రబాబు కేవలం 2-3 పథకాలు అరకొరగా అమలు చేశారన్నారు. కళ్లు ఆర్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు తనకు తానేసాటి అని మరొక్కసారి నిరూపించుకున్నాడని విమర్శించారు. ఒక్క మెడికల్ కళాశాల ఏర్పాటైతే 1500 పడకలు, స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకులు కేవీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వరరావు, ఎంపీపీలు వేగినాటి ఓసూరారెడ్డి, చేగిరెడ్డి తులశమ్మ, ఎం వెంకట్రావ్, జెడ్పీటీసీలు బీవీ రాజయ్య, వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నెమిలిదిన్నె చెన్నారెడ్డి, అబ్దుల్ గఫార్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు గొంగటి చెన్నారెడ్డి, ఆవుల శ్రీధర్‌రెడ్డి, యేరువ రంగారెడ్డి, ఎం రవికుమార్, మాజీ ఎంపీపీలు రవికుమార్‌యాదవ్, వెంకటరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు పెట్టిస్తున్న బత్తుల, కేపీ



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు

పేదోళ్ల ఆరోగ్యాన్ని దూరం చేసేందుకు కుట్ర

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పేద వర్గాల ఆరోగ్యం, వారి బిడ్డల వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నిందని, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న తన పాలనలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారని, వాటిని ఈ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు, రైతు కూలీలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లలేక తమ ప్రాణాలు కోల్పోతున్నారన్న ఉద్దేశంతో గత ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు అనుమతి తీసుకొచ్చారని చెప్పారు. వాటిలో కొన్ని కళాశాలల నిర్మాణాలు పూర్తిచేసుకొని నిర్వహణ కొనసాగుతోందని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నాయకులు పేదల రక్తాన్ని పీల్చి దోచుకోవటానికి తమ అనుచరులకు ఆ కళాశాలలను అప్పనంగా అప్పచెప్పేందుకు పీపీపీ పద్ధతిని ప్రవేశపెట్టిందని ఆయన విమర్శించారు. దీనివలన పేద, మధ్య తరగతి కుటుంబీకులు వైద్యం చేయించుకోలేని పరిస్థితిని తీసుకొస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. రాష్ట్రానికి మెడికల్ సీట్లు మంజూరు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన దుర్మార్గపు సీఎం చంద్రబాబు అని ఆయన దుయ్యబట్టారు. కూటమి నాయకులు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తమ జేబులు నింపుకోవటానికి ఇటువంటి చర్యలు చేపడుతున్నారని, మెడికల్ కళాశాలలను చిల్లర డబ్బులకు లీజుకు ఇచ్చి తాము రూ.కోట్లల్లో దోచుకొని దాచుకోవటానికే పీపీపీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని ఆయన కోరారు.

ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, గుమ్మా పద్మజ ఎల్లేష్ యాదవ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ఆర్.వాగ్యానాయక్, పార్టీ మండల కన్వీనర్‌లు గంటా వెంకట రమణారెడ్డి, దోమకాళ్ల వెంకటేశ్వర్లు, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు ఉడుముల అరుణ, ఆర్.అరుణాబాయి, పొన్న వెంకటలక్ష్మి, పల్లె సరళ, జి.శార, కె.ఓబులరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, ఒంటేరు నాగేశ్వరరావు, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, సూరె శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్ కుమార్, ఎల్.రాములు, లాలు నాయక్, షేక్.షెక్షావలి, చిట్టేల వెంకటేశ్వర రెడ్డి, సన్నెపోగు సుందరరాజు, పి.రాములు నాయక్, టి.సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఎస్.ప్రసాద్, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో డీఎస్సీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- బీటీఏ నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కర్ర దేవసహాయం

ఒంగోలు సిటీ: మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో డీఎస్సీ కౌన్సెలింగ్ నిర్వహించాలని బీటీఏ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం అన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అత్యవసర సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు బీటీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ 2025 కౌన్సెలింగ్ జీఓ నంబర్ 90 ప్రకారం సెలెక్షన్ లిస్టును రీ ఆర్గనైజ్ చేసి మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిషనర్ ఇచ్చిన నియమాలను అనుసరించి కేవలం మెరిట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారని, ఈ విధానాన్ని బీటీఏ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కేవలం మెరిట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించడం వలన రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని బీటీఏ పక్షాన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజుకు వినతిపత్రాలను మెయిల్ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటి వరకు జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసి జీఓ నంబర్ 90 అనుసరించి మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. బీటీఏ రాష్ట్ర కార్యదర్శి పారాబత్తిన జాలరామయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రిజర్వేషన్ వర్గాల వారికి తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. పదోన్నతుల్లో, బదిలీల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా కేవలం మెరిట్ ప్రకారం నిర్వహించి రిజర్వ్ వర్గాల వారికి వ్యతిరేకంగా చేసిందని చెప్పారు. సమావేశంలో బీటీఏ జిల్లా ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండమూరి కొండలరాయుడు, జిల్లా నాయకులు చెక్క కోటేశ్వరరావు, బాజీ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్రిజ్ పేలడంతో రూ.4 లక్షల ఆస్తి నష్టం

కొమరోలు: షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద శబ్దంతో ఫ్రిజ్ పేలిపోయిన సంఘటన కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రాజుపాలెం గ్రామానికి చెందిన దద్దనాల చెంచయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిజ్ పేలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండటంతో ఎవరికీ ఎటువంటి హానీ జరగలేదు. అయితే, ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతవడంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు చెంచయ్య తెలిపారు. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

కొండపి: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపి మండల కేంద్రంలోని పొదిలి రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ సమీపంలో చోటుచేసుకుంది. కొండపి ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఆరీఫ్ (22)కు తాను ప్రేమించిన యువతితో మనస్పర్థలు తలెత్తి గొడవలు జరుగుతూ ఉన్నాయి. హైదరాబాద్‌లో వారు నివసిస్తున్న సమయంలో గొడవల కారణంగా అక్కడి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లో రిపోర్టు ఇవ్వగా ఆరీఫ్‌కు, ఆ యువతికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అప్పటి నుంచి ఇద్దరికీ ఎక్కువగా గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవల కారణంగా మనస్తాపం చెందిన ఆరీఫ్ శుక్రవారం అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో కొండపిలోని ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మరణించాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంగోలులో పోలీసుల విస్తృత తనిఖీలు


ఆర్టీసీ బస్టాండులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలో పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, డార్మిటరీ, కొత్త కూరగాయల మార్కెట్, పాత కూరగాయల మార్కెట్, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో తనిఖీలు చేశారు. పేలుడు పదార్థాలు కనుగొనడంలో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలం చీతా సహాయంతో డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలలో పాల్గొంది. టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ బృందం మాదక ద్రవ్యాలు, ఇతర అక్రమ రవాణాను గుర్తించడానికి అనువణువూ పరిశీలన చేశారు. అనుమానం కలిగిన బ్యాగులను పరిశీలించడమే కాకుండా వ్యక్తుల వద్ద గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. తనిఖీలలో ఎస్సై శివరామయ్య, డాగ్ హ్యాండర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం.. ప్రజలే శ్రమదానం..!

- పాడైపోయి వాహన ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డు
- పలువురు ప్రమాదాలకు గురై గాయాలతో ఆస్పత్రి పాలు
- ఆరు నెలల క్రితం ఒక మహిళ మృతి
- శుక్రవారం రాత్రి యువకుడికి గాయాలు
- నెలల తరబడి పట్టించుకోని పాలకులు, అధికారులు
- స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్న యువత
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనకు నిలువెత్తు నిదర్శనం


ఒంగోలు - మంగమూరు రోడ్డుపై పాడైపోయి ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతంలో మరమ్మతులు చేస్తున్న మంగమూరు యువకులు

సంతనూతలపాడు:

కూటమి ప్రభుత్వంలో చెప్పేదొకటి..చేసేదొకటి అనేదానికి రోడ్లే నిదర్శనంగా ఉన్నాయి. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలోని రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయించామని సీఎం చంద్రబాబు నుంచి ఎమ్మెల్యేల వరకూ గొప్పలు చెప్పుకుంటుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. అనేక ప్రధాన రహదారులు సైతం అధ్వానంగా మారి ప్రయాణికుల నడ్డి విరుస్తున్నాయి. ఇలాంటి ఓ రోడ్డు గురించి పాలకులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆరు నెలల క్రితం ఏకంగా ఒక మహిళ మృత్యువాతపడింది. ఈ రోడ్డు ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉందా అంటే.. అదేమీ కాదు. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలోనే ఉంది. అదే.. ఒంగోలు నుంచి మంగమూరు వెళ్లే రోడ్డు. ఈ రోడ్డులో సుందరమ్మ వాగు వద్ద తారు రోడ్డు 20 అడుగుల పొడవున ఉబ్బెత్తుగా మారి ప్రమాదాలకు నిలయమైంది. కొణిజేడు కొండ నుంచి ఎర్రమట్టిని ఓవర్ లోడుతో తరలిస్తూ వాహనాలు తిరుగుతుండటంతో ఈ రోడ్డుపై కొంత భాగం దెబ్బతింది. రోడ్డు ఉబ్బెత్తుగా మారిన ప్రాంతం ప్రమాదాలకు కారణమవుతోంది.

రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగి పలువురికి గాయాలు...

రాత్రి వేళల్లో ఒంగోలు నుంచి మంగమూరు రోడ్డుపై ప్రయాణం చేసేవారు సుందరమ్మ వాగు వద్ద ఉబ్బెత్తుగా మారిన రోడ్డును గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారు. ఆరు నెలల క్రితం మంగమూరు గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఒంగోలు వెళ్లి రాత్రివేళ తిరిగి ఇంటికొస్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. వాహనం వెనుకవైపు కూర్చున్న మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్లో సుమారు పది లక్షల రూపాయలు వెచ్చించి చికిత్స పొందినప్పటికీ ఫలితం దక్కలేదు. చివరకు మృత్యువాత పడింది. తరచూ ఎవరో ఒకరు అదే ప్రాంతంలో ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్నారు. గత శుక్రవారం రాత్రి కూడా మంగమూరుకు చెందిన ఒక యువకుడు ఒంగోలు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తూ ఉబ్బెత్తుగా ఉన్న తారు రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.


రోడ్డు పాడైపోయిన ప్రాంతంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన మంగమూరుకు చెందిన యువకుడు

వరుస ప్రమాదాలతో మంగమూరు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో వారే స్వయంగా రంగంలోకి దిగారు. మంగమూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువకులు శనివారం ఉదయం శ్రమదానం చేసి ఉబ్బెత్తుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డు భాగాన్ని తవ్వి చదును చేశారు. ఇక్కడే కాకుండా ఓవర్ లోడుతో వాహనాలు ప్రయాణించడం వలన మంగమూరు - ఒంగోలు రోడ్డు పలు చోట్ల పాడైపోయి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతులు చేసిన వారిలో మంగమూరు అంబేడ్కర్ నగర్ యువకులు కొండసింగు ధనుంజయ, పైడి హనుమంతరావు, పందిపాటి రవి, కసుకుర్తి శివ, కంకణాల వెంకటేశ్వర్లు, మంచికలపాటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ఒంగోలు - కర్నూలు రోడ్డుపై సంతనూతలపాడు సమీపంలోని బ్రిడ్జిపై ఉన్న గొయ్యి

కర్నూలు రోడ్డుపై నెల రోజులుగా గొయ్యి..!

- 20 రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైనా స్పందించని అధికారులు, పాలకులు
- ప్రస్తుతం మరింత పెద్దదిగా మారి ప్రమాదకరంగా మారిన గొయ్యి

ఒంగోలు - కర్నూలు రోడ్డుపై సంతనూతలపాడు సమీపంలో ఉన్న బ్రిడ్జి మీద రోడ్డు దెబ్బతిని నెల రోజుల క్రితం గొయ్యి ఏర్పడింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపై పెద్ద గొయ్యి పడి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీనిపై గత నెల 22వ తేదీ సాక్షి దినపత్రిక ఒంగోలు క్లస్టర్ పేజీలో 'రహదారి ఇలా.. రాకపోకలు సాగేదెలా' అనే శీర్షికతో గొయ్యికి సంబంధించిన ఫొటోలతో కథనం కూడా ప్రచురితమైంది. ఇరవై రోజులైనా అధికారులుగానీ, పాలకులుగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం ఆ గొయ్యి పెద్దదిగా మారి మరింత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వ అధ్వానపు పరిపాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. పైగా, ఆ గొయ్యి వద్ద అడ్డంగా పోలీసులు బ్యారికేడ్ ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వదిలేయడాన్ని వాహనదారులు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అసలే వంతెన కావడంతో ఆ గొయ్యి వద్ద ఏమాత్రం ప్రమాదం జరిగినా భారీ నష్టం జరిగే అవకాశం ఉండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

గ్రానైట్ రాళ్లతో భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదం జరిగే అవకాశం...

చీమకుర్తి మండలంలోని రామతీర్థం గ్రానైట్ క్వారీల నుంచి గ్రానైట్ రాళ్ల ఓవర్ లోడుతో నిత్యం భారీ టిప్పర్లు, ట్రాలీలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జిపై గొయ్యి ఏర్పడిన ప్రాంతంలో సగం రోడ్డుకు అడ్డంగా పోలీసులు బ్యారికేడ్ ఏర్పాటు చేసి వదిలేయడంతో అక్కడ సగం రోడ్డుపైనే వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో అక్కడ ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పైగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జి కింద నీటి ప్రవాహం ఎక్కువై రోడ్డు మరింత దెబ్బతింటోంది. ఫలితంగా ఆ బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన గొయ్యి సైజు పెరుగుతూ వస్తోంది. అయినప్పటికీ పాలకులుగానీ, అధికారులుగానీ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రోడ్లను సూపర్‌గా చేశామని సీఎం, ఎమ్మెల్యేలు చెప్పుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుండటంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. నడిరోడ్డుపై ఉన్న గోతులు కూడా పూడ్చకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులైనా స్పందించాలని కోరుతున్నారు.



గొయ్యిపై 20 రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనం

నమ్మించి మోసం చేశాడు న్యాయం చేయండి సార్

- మీడియాతో బాధితురాలి ఆవేదన
- రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణ

ఒంగోలు టౌన్: పెళ్లి చేసుకుంటానని, తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించడంతో చేతిలోని డబ్బంతా ఇచ్చేశానని, తీరా అవసరం తీరాక మోసం చేసి మొహం చాటేశాడని ఒక మహిళ కన్నీరు పెట్టుకుంది. శనివారం మీడియా ముందుకు వచ్చి తన గోడు వినిపించింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఒంగోలు నగరంలోని సంతపేటకు చెందిన పల్లపు మల్లేశ్వరి భర్త వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు కాగా, పోషించే స్తోమత లేకపోవడంతో ఒక కుమారుడిని దత్తత ఇచ్చి రెండో కుమారుడిని తన వద్ద ఉంచుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో తోపుడు బండి మీద టిఫిన్ పెట్టుకుని కుమారుడిని డిగ్రీ వరకు చదివించింది. ఏడేళ్ల క్రితం ఆమెకు రైల్వేస్టేషన్ పార్శిల్ ఆఫీసులో లైసెన్స్ పోర్టర్‌గా పనిచేసే ఈదురుపల్లి కిషోర్ కుమార్ నాయుడుతో పరిచయం ఏర్పడింది. అదికాస్తా సహజీవనానికి దారితీసింది. పెళ్లి చేసుకుంటానని, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో కిషోర్‌కు మూడేళ్లలో 4 లక్షల రూపాయలు ఇచ్చింది. ఇటీవల తనను పెళ్లిచేసుకోవాలని అడగడంతో కిషోర్ మొహం చాటేశాడు. ఆమె దగ్గర తీసుకున్న డబ్బు తిరిగివ్వమని అడిగితే.. నాకు డబ్బులు ఎప్పుడు ఇచ్చావంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. గత్యంతరం లేక మల్లీశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడ కూడా ఆమెకు న్యాయం జరగలేదు. ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో కూడా ఫిర్యాదు చేసింది. ప్రయోజనం లేకుండా పోయింది. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు తన ఫిర్యాదును పక్కన పెట్టేశారని కన్నీరు పెడుతోంది. పైసా పైసా కూడబెట్టుకున్న డబ్బులన్నీ తీసుకుపోయాడని, తన మీద దాడులు చేయిస్తున్నాడని, ఇప్పటికైనా పోలీసులు తనకు న్యాయం చేయాలని కన్నీళ్లతో మీడియాను వేడుకుంది.

వాగులో పడి బాలుడు మృతి

గిద్దలూరు రూరల్: వాగులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని గడికోట గ్రామ సమీపంలో గల సగిలేరువాగు వద్ద శనివారం జరిగింది. గడికోట గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ (15) గేదెలను మేపేందుకు వాగు సమీంలోకి తీసుకెళ్లాడు. ఆ సమయంలో గేదెలు వాగులో ఉండటం వల్ల వాటిని బయటకు తోలేందుకు వాగులోకి దిగాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ వాగు లోతట్టు ప్రాంతంలో చిక్కుకుని మునిగిపోయాడు. స్థానికులు అతడిని వాగులో నుంచి బయటకు తీసేలోపే మృతి చెందాడు. హుస్సేన్ ముండ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో గేదెలను మేపేందుకు వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. తల్లిదండ్రులకు హుస్సేన్ పెద్ద కుమారుడు కాగా, ఒక చెల్లి, ఒక తమ్ముడు ఉన్నారు.


వాగులో పడి మృతిచెందిన హుస్సేన్

తొలి మద్యం తయారీ కేంద్రం కుప్పం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్రంలో మొదటి డిస్టిలరీ ఫ్యాక్టరీ కుప్పంలోనే ప్రారంభం అయిందని.. చివరి డిస్టిలరీ కేంద్రం విశాఖపట్టణంలో ఏర్పాటు చేశారని, అదికూడా స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు చెందిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధులు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి తీసుకొని వచ్చింది మద్యం కంపెనీలు తప్ప ప్రజలకు మంచి చేసే కంపెనీలు తేలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు నవరత్నాల పథకం కింద అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలకు ఎంతో మేలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి అన్నీ చేశామని డప్పాలు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మహిళలు, రైతులకు జరుగుతున్న అన్యాయాలపై వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపడుతుంటే అరకొరగా పథకాలను అమలు చేశారని చెప్పారు.

అబద్ధాల ప్రచారంలో దిట్ట..

ఇటీవల సూపర్ సిక్స్-సూపర్ సక్సెస్ అని మూడు హామీలు స్త్రీశక్తి, నిరుద్యోగ భృతి, 50 సంవత్సరాల పింఛన్ ఎత్తివేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని గ్లోబల్ ప్రచారం చేయడం మొదలు పెట్టారని ఆయన అన్నారు. దుర్మార్గంగా చంద్రబాబు నాయుడు తప్పులు చేసుకుంటూ పోతూ ఉంటే మనం వాటిని పట్టించుకోకుండా వదిలేస్తే పేద ప్రజలకు తాము కూడా అన్యాయం చేసినవారమవుతామన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా గ్రామాలలో ప్రజలకు అవగాహన పరచాలని, వారిలో చైతన్యం తీసుకొని రావాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరు కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, అల్ల ఆంజనేయరెడ్డి, గుమ్మా ఎల్లేష్ యాదవ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ఆర్.వాగ్యానాయక్, పార్టీ మండల కన్వీనర్‌లు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, దోమకాళ్ళ వెంకటేశ్వర్లు, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, వివిధ విభాగాల రాష్ట్ర జిల్లా నాయకులు ఉడుముల అరుణ, ఆర్.అరుణాబాయి, పొన్న వెంకటలక్ష్మి, పల్లె సరళ, గార్లపాటి శార, కె.ఓబులరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, కందూరి కాశీవిశ్వనాథ్, పి.రాములు నాయక్ పాల్గొన్నారు.

60 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం

మార్కాపురం: మార్కాపురం మండలం తిప్పాయిపాలెం వద్ద దొర్నాల నుంచి నంద్యాలకు వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం వేకువజామున పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. వాహనంలో 60 బస్తాల బియ్యం ఉన్నట్లు చెప్పారు. బాషా, ఫణి, నారాయణ రెడ్డి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బీకే త్రషర్స్‌ను పరిశీలించిన బీమా కంపెనీ

సింగరాయకొండ: అగ్నిప్రమాదం సంభవించిన బీకే త్రషర్స్ కంపెనీని ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, క్లూస్ టీం సిబ్బంది శనివారం పరిశీలించారు. మూడు ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పేప్రయత్నం చేశాయని, మంటలు అదుపులోనే ఉన్నా ఇంకా బేళ్లు మండుతున్నాయని కంపెనీ ప్రతినిధులు వారికి వివరించారు. కాగా బీకేటీ కంపెనీ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమ కంపెనీలో జీపీఐకి చెందిన రూ.550 కోట్ల విలువైన పొగాకు, ఎల్అండ్‌ఎం కంపెనీకి చెందిన రూ.18 కోట్ల విలువైన పొగాకు కాలిపోయిందని, గోడౌన్‌కు రూ.30 కోట్లు కలిపి మొత్తం రూ.598 కోట్ల నష్టం వాటిల్లిందని జీఎం శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

కూలిన మట్టి మిద్దె


పడిపోయిన మట్టి మిద్దె

గిద్దలూరు రూరల్: పట్టణంలోని 9వ వార్డు కుమ్మరివీధిలో పల్లె నాగమ్మకు చెందిన మట్టి మిద్దె ప్రమాదవశాత్తూ కూలిపోయింది. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా నాని ఉంది. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ కూలిపోయింది. ఆ సమయంలో నాగమ్మ వరండాలో నిద్రిస్తుండటంతో ప్రమాదం తప్పింది. మిద్దెలోని దంతెలు, మట్టి కిందపడిపోవడంతో ఇంట్లోని వస్తువులు, నిత్యావసర సరుకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మిద్దె కూలి తనకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలై వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలో జరిగింది. కె.బయనపల్లె గ్రామానికి చెందిన పాములేటి (39) అనే వ్యక్తి తన బైక్‌పై పెద్దచెరువు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కిందపడిపోయాడు. నంద్యాల హైవేలో విధులు నిర్వర్తిస్తున్న హైవే పోలీసులు పాములేటిని 108 అంబులెన్స్‌లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మృతిచెందిన పాములేటి

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

ONE SITTING
■ గుజరాత్ లో ప్రముఖ యూనివర్సిటీ నుండి డిగ్రీ మరియు B.Tech, MBA, MCAలకు Exams రాపించి సర్టిఫికెట్స్ ఇప్పించబడును. వివరాలకు సంప్ర: సెల్. 70936 21555. [SCA25008631]

COMPUTER EDUCATION
■ నిరుద్యోగ M/Fలకు Govt. ద్వారా ఉచితంగా కంప్యూటర్, TALLY, స్పోకెన్ ఇంగ్లీష్, M.S.ఆఫీస్ కోర్సులు నేర్పించి జాబ్ కల్పించబడును. ఫ్రీ హాస్టల్, ఫ్రీ మీల్స్ మరియు స్టైఫండ్ కలదు. సంప్రదించండి. సెల్: 94934 49782. [SCA25008751]

Real Estate

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ. సంప్ర: జనచైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 73823 96677 [G-282]

FLAT FOR SALE
■ ఒంగోలు టౌన్ రాజీవ్ నగర్ నూతన నిర్మాణం జరుగు అపార్ట్మెంట్ 3BHK. 2000 SFT, ఈస్ట్ ఫేస్,ఫ్లోర్ కి 1ఫ్లాట్ మాత్రమే అమ్మబడును. సె.89198 39732. [SCA25008883]

HOUSE FOR SALE
■ ఒంగోలుసిటీ, M.M. దొంక, ఆశ్రమం లో 17గదులలో 2BHK ఇండిపెండెంట్ హౌస్ రెడీ టు ఆక్యుపై, కార్ పార్కింగ్ తో అమ్మబడును. సె.96525 29369. [SCA25008882]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762

అద్దెకు/లీజుకు
■ 1 ఎకరం ఓపెన్ ల్యాండ్-అద్దెకు/లీజుకు కలదు. ఏడుగుండ్లపాడు NH-5 రోడ్డుని అనుకొని Highway City - వెంచర్ ప్రక్కన గల ఖాళీస్థలం - Hotels, Godowns, Show Rooms అనుకూలమైనది. ఒంగోలు. 5km Cell:9849115524, 7729939130. [OA-497]

Services

GOLD FINANCE
■ MVS Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మీరున్న ప్రాంతంలో మీ దగ్గరకే వచ్చి విడిపించి కొనబడును. 8143299166, 9281458813. [NA-11404]

Wanted

■ ఒంగోలులోని శ్రీ రత్నశ్రీ మెడికల్ షాపు నందు వర్క్ చేయుటకు అనుభవం కలిగిన or న్యూ Boys కావలెను. సంప్ర: సెల్:9966581651. [SCA25008890]

■ చేతిరాత ట్రైనర్స్ కావలెను. జీతం: రూ.12,000 -40,000 (అనుభవం & నైపుణ్యాన్ని బట్టి) గమనిక: అందమైన, స్పష్టమైన చేతిరాత నేర్పించి ఉపాధి కల్పించబడుతుంది. PVR Academy of Handwriting, ONGOLE. Ph:90108 17003. [OA-494]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో ప్రముఖ హోమ్‌కేర్ ఆఫీస్ కి ఇంటి వద్దనే ఉండి పెద్దవారిని చూసుకోనుటకు అనుభవంగల స్టాఫ్ కావలెను. ✆ 916083 5559, 99121 15559 [B-279]

■ ఒంగోలు టౌన్ లో 3 సం॥ సీనియర్ సెక్యూరిటీ HG, గార్డ్స్ కావలెను. జీ 15650,13400 PF ESIతో డ్యూ 12గం రూమ్+భోజనం ఫ్రీ. ✆ 8331876264 [SCA25008865]

■ అగార్ ఉడ్ ఫాం లాండ్ వెంచర్‌ను మార్కెటింగ్ చేయుటకు సిబ్బంది కావలెను. అర్హత, అనుభవం తో పనిలేదు. ఫ్రెషర్స్ కూడా జాయిన్ కావచ్చు. మంచి కమీషన్ ఇవ్వబడును. 91213 59799 [G-152]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 93981 78409, 82475 00792 [B-11280516]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph : 9640400073, 9160900024 [SCA25008783]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931 [HA-16191]

■ "Yallori Services" Water Proofing Service, Plumbing, Painting, Wall & Old Building Dismendal Service, "100% Customer Satisfaction is Our Motto" All Prakasam District Service cont. BRAHMA Cell: 63018 67609, 82848 22787. [SCA 25008404]

■ Varalakshmi automobiles Pvt.Ltd. requires Service Manager: Exp.10 Years, Service Advisor: Exp.Min.2 Years, Floor Incharge,Sales Executives with Min. 2 Years exp.inAutomobiles, FMCG & Any retail business Location: Kandukuru, Inkollu /Parchur, Addanki, Yerragunda palem, Ongole. Mail Id:: vlautohr@gmail.com:: ✆ 8688142233, 8977866115 [NA-249]

■ Wanted a Marketing Executive to Work for Jr College in VJA. Salary + incentive 8297225577, 9676862477 [HA-16364]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.